క్లుప్తంగా

2న ఆదివాసీ సంఘాలతో సమావేశం

ఇంద్రవెల్లి: ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి అమర వీరుల స్తూపం వద్ద నిర్వహించే అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహణపై ఏప్రిల్2న ఆదివాసీ యువకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తుడుందెబ్బ మండల అధ్యక్షుడు భరత్ శుక్రవారం తెలిపారు. న్యాయమైన హక్కుల కోసం పోరాడి అమరులైన ఆదివాసీ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించేందుకు ఆదివాసీ సంఘాలు, పెద్దలతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ పెద్దలు హాజరు కావాలని కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్: ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ స్టూడెంట్ ఫోరమ్ సొసైటీ అధ్యక్షుడు రాహుల్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓసియన్ కంప్యూటర్ కేంద్రంలో విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓసియన్ కేంద్రం సిబ్బంది మహేశ్‌సింగ్, సాయికుమార్, వేణు, అంకిత, సత్యనారాయణ, టీఎస్‌ఎఫ్ నాయకులు ఇఫ్తేకార్, సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

ఇచ్చోడ: బోథ్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బోథ్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలతో పాటుగా, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వానికి విన్నవించినా.. పట్టించుకోలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో బోథ్‌కు వచ్చిన సందర్భంగా పీసీసీ హోదాలో ఇచ్చిన మాట నెరవేర్చాలన్నారు. ఇందులో ఎంపీటీసీ మహేందర్, బోథ్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు భోజన్న, బీసీ సెల్ కార్యదర్శి బారే నాగేందర్, అడేపు కిరణ్‌కుమార్, నిగిని ఉప సర్పంచ్ సాయన్న, తదితరులు ఉన్నారు.

'సమావేశాన్ని విజయవంతం చేయండి'

ఇచ్చోడ: ఈనెల 31న ఇచ్చోడ మండల కేంద్రంలో రాయల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకాలు వేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని జల్దా గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య సిబ్బంది దేవ్‌రావు, శేఖర్‌లు కోరారు.

'కార్యకర్తలను గెలిపించుకుంటాం'

నేరడిగొండ: రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలను గెలిపించుకుంటామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు తమను గెలిపించారని, ఇక రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఎవరూ అధైర్యపడొద్దన్నారు. తనకున్న వ్యవసాయ పొలాన్ని అమ్మి కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు.

వీల్‌చైర్ వితరణ



వీల్‌చైర్ అందజేస్తున్న సభ్యులు

ఇచ్చోడ: బోథ్ మండలంలోని గుర్రలతండాలో శుక్రవారం తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రఘువీర్ అనే దివ్యంగా యువకుడికి వీల్‌చైర్ అందచేశారు. గత కొన్ని రోజుల నుంచి అంగవైకల్యంతో బాధపడుతూ.. నడవలేని స్థితిలో ఉన్నాడు. ఇచ్చిన మాట ప్రకారం వీల్ చైర్‌ను సభ్యులు అందచేశారు.

అటు బ్యాటింగ్.. ఇటు బెట్టింగ్

- ఆన్‌లైన్ యాప్‌ల్లో రూ.లక్షల్లో బెట్టింగ్
- ఈజీమనీ కోసం గ్రామీణయువత అడ్డదారులు
- ఐపీఎల్ నేపథ్యంలో నిఘా తప్పనిసరి



కౌటాల: క్రికెట్ ఇష్టపడే అభిమానులకు ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) సీజన్ వచ్చిందంటే పెద్ద పండగే. పనులు మానేసి, టీవీలు, స్మార్ట్‌ఫోన్ల ముందు కూర్చొని మ్యాచ్‌లు చూస్తుంటారు. అయితే ఐపీఎల్ నేపథ్యంలో బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. గతంలో నగరాలు, పట్టణాలకే పరిమితమైన క్రికెట్ బెట్టింగ్ పల్లెలకూ పాకింది. జిల్లాలోని కౌటాల, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, తిర్యాణి, రెబ్బెన, వాంకిడి, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాలతో పాటు మారుమూల ప్రాంతాల్లోనూ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. జిల్లాలో ప్రతిరోజు రూ.లక్షల్లో బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌కు చేతిలో డబ్బులు లేకున్నా.. లోన్‌యాప్స్, అప్పులు చేసి బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. బెట్టింగ్‌లో నష్టపోతే డబ్బులు తిరిగి చెల్లించడానికి నానా తిప్పలు పడుతున్నారు.

ప్రత్యేక నిఘా ఏది ?

ఎంతో మంది యువత బెట్టింగ్ బారిన పడి అవస్థలు పడుతున్నారు. స్మార్ట్‌ఫోన్‌లోనే క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు నిక్షిప్తం చేసుకొని ఫోన్‌పే, గూగుల్‌పే యూపీఐ ఐడీలతో రూ.వేలల్లో డబ్బులు బదిలీ చేస్తూ గుట్టు చప్పుడూ కాకుండా బెట్టింగ్ చేస్తున్నారు. యువత తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలు అనుసంధానం చేసి ఉన్న యూపీఐ ఐడీల ద్వారా డబ్బులు పందెం కాస్తున్నారు. ఈజీమనీ కోసం చెడుదారి పడుతుండడం వారి కెరీర్ సైతం ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. డబ్బు ఖర్చుపెడుతున్న తీరును అడిగి తెలుసుకోవాలి. పిల్లలు పెద్ద మొత్తంలో డబ్బులు అడిగినప్పుడు ఎందుకని ఆరా తీయాలి. పెడదారిన వెళ్తున్నట్లు గమనిస్తే.. వెంటనే వారికి కౌన్సెలింగ్ ఇప్పించి, అవగాహన సదస్సులకు పంపించాలి. ఐపీఎల్ ప్రారంభం కావడంతో పోలీసులు కూడా ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. పోలీసులు, అధికారులు అనుమానం ఉన్న యువతకు సంబంధించిన బ్యాంక్ ఖాతాల నగదు బదిలీలను పరిశీలిస్తే దీనిని కొంతైనా అడ్డుకోవచ్చు.

గతంలో సంఘటనలు

గతంలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతూ జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్‌కు చెందిన కొంత మంది పోలీసులకు చిక్కిన సందర్భాలున్నాయి. 2021 అక్టోబర్ 6వ తేదీన కౌటాల మండలంలోని ముత్తంపేట గ్రామంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు బెట్టింగ్ రాయుళ్లు ఔరంగాబాద్‌కు చెందిన వ్యక్తితో ఒక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ నిషేధిత క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు వారి వద్ద నుంచి రెండు ఫోన్లు, రూ.10,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండేళ్ల క్రితం ఐపీఎల్ సమయంలో కాగజ్‌నగర్ డివిజన్‌కు చెందిన యువకులు క్రికెట్ బెట్టింగ్ ఆడుతూ పట్టుబడగా వారి వద్ద నుంచి పోలీసులు డబ్బుల వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. పోలీసులు బెట్టింగ్ రాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, బెట్టింగ్ దందాను రూపుమాపేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు



క్రికెట్ బెట్టింగ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాం. గతంలో పలువురిపై కేసులు నమోదు చేశాం. యువతకు అవసరం మేరకు మాత్రమే తల్లిదండ్రులు డబ్బులివ్వాలి. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడి యువకులు ఆర్థికంగా నష్టపోవద్దు. నిషేధించిన యాప్‌ల్లో బెట్టింగ్‌లకు పాల్పడితే శిక్ష తప్పదు. ఎవరైనా బెట్టింగ్ పెడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– ఎన్. మధుకర్, ఎస్సై, కౌటాల

బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: బాల్య వివాహాలు జరిపిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పర్సనంబాల గ్రామంలో బాల్య వివాహం జరిపిస్తున్నారన్న సమాచారం మేరకు సంబంధిత అధికారుల సమన్వయంతో గ్రామానికి చేరుకొని వివాహాన్ని నిలిపివేశారు. ఈ సందర్భంగా అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులకు బాల్య వివాహం చేయడం వల్ల కలిగే నష్టాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లుగా తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్యలక్ష్మి, సీడీపీవో నదియా రుక్సానా, జిల్లా బాలికా సంరక్షణ అధికారి మహేశ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన



పీటీఆర్ పరిశీలిస్తున్న ఎస్‌ఈ వాసుదేవ్

కెరమెరి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఇటీవల బిగించిన పీటీఆర్(పవర్ ట్రాన్స్‌ఫార్మర్)ను శుక్రవారం విద్యుత్‌శాఖ ఎస్‌ఈ వాసుదేవ్ పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులు ఇబ్బందులు పడకుండా విద్యుత్ సరఫరా చేయాలని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని కెస్లాగూడలో ఉన్న ఎల్‌అండ్‌టీ వాటర్ గ్రిడ్‌ను పరిశీలించారు. డీఈ వెంకటేశ్, డీఈఈ శ్రీనివాస్, ఎల్ఐ రాజశేఖర్, జేఎల్‌ఎం సుదర్శన్, రంజిత్, సిబ్బంది మారుతి, రవి ఉన్నారు.

సెంట్రల్ సిలబస్ కోసం కసరత్తు

రెబ్బెన: ఏఐటీయూసీ కృషి ఫలితంగా సింగరేణి పాఠశాలల్లో యాజమాన్యం సెంట్రల్ సిలబస్‌ను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోందని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. శుక్రవారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికైతే సింగరేణి ఉన్నత పాఠశాలల్లో సెంట్రల్ సిలబస్ అమలు చేయిస్తామని హామీ ఇచ్చామన్నారు. దానిలో భాగంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్‌లు యాజమాన్యంతో చర్చించారని, సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ విద్యా విధానాన్ని అమలు చేసేందుకు యాజమాన్యం నిర్ణయించిందని పేర్కొన్నారు. స్టేట్ సిలబస్, సెంట్రల్ సిలబస్‌లపై కార్మికుల నుంచి అభిప్రాయ సేకరణకు సర్క్యూలర్ జారీ చేసిందని తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న కార్మికులంతా తమ పిల్లలను ఎంతో ఉపయోగకరమైన సెంట్రల్ సిలబస్ విధానాన్ని అమలు చేసేలా యాజమాన్యానికి తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు.

'ఉపాధి' పైసలేవి..?



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- డబ్బులు అందక కూలీల తిప్పలు
- సకాలంలో అందించాలని వేడుకోలు

లింగాపూర్: గ్రామాల్లో వలసల నివారణకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం కూలీలకు ఉపాధి కల్పిస్తోంది. పనులు చేసే చోట సదుపాయాల సంగతి దేవుడెరుగు.. కనీసం చేసిన పనికి కూలీ డబ్బులు కూడా అందడం లేదు. ఏటా వేసవి కాలంలో అందించే అదనపు అలవెన్సులు సైతం నిలిపివేశారు. మరోవైపు సౌకర్యాలు లేక మండుతున్న ఎండల నేపథ్యంలో ఉపాధికూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అందని కూలి..

ఉపాధిహామీ చట్టం ప్రకారం 14 నుంచి 15 రోజుల్లో చేసిన పనికి కూలి చెల్లించాల్సి ఉంటుంది. కానీ రెండు నెలలు గడుస్తున్నా మండలంలోని ఉపాధిహామీ కూలీలకు డబ్బులు చెల్లించలేదు. డబ్బులు రాక తీవ్రంగా అవస్థలు పడుతున్నామని ఉపాధి కూలీలు వాపోతున్నారు. అర్ధాకలితో పనులు చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో కూలీలు పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉపాధి పనులకు రావాలని ఈజీఎస్ అధికారులు కూలీలను బతిమాడాల్సిన పరిస్థితి నెలకొంది.

4000 మందికి జాబ్‌కార్డులు

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో మొత్తం 4000 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇప్పటి వరకు 1200 మంది కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు దినసరి కూలీ రూ.272గా నిర్ణయించింది. అయినా వేతనాలు అందించడంలో జాప్యం చేస్తుండడంతో మండలంలో పలు గ్రామాల్లో వందలాది మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు.

వేతనాలు అందడం లేదు



పనులు చేస్తున్నా తమకు వేతనాలు సకాలంలో అందడం లేదు. ఇప్పటికే రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఇంట్లో ఖర్చులకు, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నాం.

– కేవలాబాయి, లింగాపూర్, ఉపాధి కూలీ

సకాలంలో అందేలా చూస్తాం

గ్రామాల్లో ఉపాధికూలీలకు సరిపడా పనులు గుర్తించాం. పనులకు రావాలని కూలీలను అడుగుతున్నాం. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని ప్రస్తుతం మండలంలో మొత్తం 1200 మంది కూలీలు మాత్రమే పనులకు వస్తున్నారు. పెండింగ్ బిల్లులను త్వరలో చెల్లిస్తాం.

– రామకృష్ణ, ఏపీవో, లింగాపూర్

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



కల్వరి గిరిపై ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కౌటాల చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



కల్వరి గుట్టపైకి శిలువ మోసుకెళ్తున్న క్రైస్తవులు

కౌటాల: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌటాలలోని కథలిక్ చర్చిలో ఫాదర్ టామో క్రైస్తవులకు దేవుని వాక్యం బోధించారు. మండలంలోని విజయనగరం చర్చిలో ఫాదర్ సీజో, యాపలగూడలో ఫాదర్ సతీశ్, శివలింగాపూర్ చర్చిలో పాస్టర్ సువార్త రాజన్న, సదాశివపేట చర్చిలో పాస్టర్ శ్రీనివాస్, కౌటాల చర్చిలో పాస్టర్ శాంతికుమార్, రాంచందర్ నాయక్ క్రైస్తవులకు దేవుడి వాక్యం బోధించారు. ఆయా ప్రార్థన మందిరాలలో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కల్వరి గిరిపై ప్రార్థనలు..

మండలంలోని క్రైస్తవులు శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని కల్వరిగిరి (గుట్ట)పై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని విజయనగరం, కౌటాల, యాపలగూడ, చింతలమానెపల్లి మండలంలోని బాలజీ అనుకోడ గ్రామాలలో గల ప్రార్థన మందిరాలలోని క్రైస్తవులు మండల కేంద్రానికి యేసు క్రీస్తు కీర్తనాలు పాడుతూ పాదయాత్రగా వచ్చారు. అనంతరం భారీ శాంతి ర్యాలీగా కల్వరి గిరి పైకి వెళ్లారు. ఫాదర్లు సీజో, సతీశ్, టామో, బినోయ్, బైజు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరపడానికి సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ సాదిక్ పాషా

చింతలమానెపల్లి: ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. శుక్రవారం మండలంలోని కోర్సిని, రణవెల్లి, గంగాపూర్, బూరెపెల్లి గ్రామాలలో సీఆర్‌పీఎఫ్ సాయుధ బలగాలతో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని ప్రజలు ఈమేరకు నడుచుకోవాలన్నారు. అనుమానాస్పద పరిస్థితులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎస్సై నరేశ్, పోలీసులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



చింతకుంటలో పట్టుకున్న గుడుంబా, సామగ్రితో పోలీసులు

కౌటాల: గ్రామాల్లో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. శుక్రవారం సిర్పూర్ (టి) మండలంలోని చింతకుంట గ్రామంలో ఎస్సై దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. గ్రామాల్లో గుడుంబా తయారీ కేంద్రాలను తనిఖీ చేసి గుడుంబాతో పాటు గుడుంబా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారు చేస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. అనంతరం గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేసి పరిశీలించారు. కౌటాల సీఐ సాదిక్ పాష, ఎస్సైలు దీకొండ రమేశ్, మధుకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుదుకాణంపై కేసు నమోదు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని ఒక బెల్టు దుకాణంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామంలోని పాండవుల భీమన్న దుకాణంలో 8.5 లీటర్ల లిక్కర్ లభించినట్లు ఆయన తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఖాళీలు భర్తీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఈపీ ఆపరేటర్లు

రెబ్బెన: బెల్లంపల్లి రీజియన్‌లో ఈపీ ఆపరేటర్లకు సంబంధించిన ప్రమోషన్ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో విధులు నిర్వహిస్తున్న ఈపీ ఆపరేటర్లు ఎస్.తిరుపతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రామగుండం, కొత్తగూడెం రీజియన్‌లలో ప్రమోషన్లను భర్తీ చేసేందుకు యాజమాన్యం ఈపీ ఆపరేటర్లకు పరీక్షలు నిర్వహించి పూర్తి చేసిందన్నారు. కేవలం బెల్లంపల్లి రీజియన్‌లో మాత్రమే అన్ని ఏరియాలకు భిన్నంగా ప్రమోషన్లను భర్తీ చేసేందుకు యాజమాన్యం ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతోందని పేర్కొన్నారు. ఈపీ ఆపరేటర్లకు డీ నుంచి సీ, సీ నుంచి బీ, బీ నుంచి ఏకు కల్పించే ప్రమోషన్లను సాధారణంగా నిర్వహించేవే తప్పా ప్రత్యేకమైనవి కావని వీటికి ఎన్నికల కోడ్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. యాజమాన్యం వెంటనే బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని ఈపీ ఆపరేటర్లకు పరీక్షలు నిర్వహించి ప్రమోషన్లను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్లలో ఖాళీలతో నిమిత్తం లేకుండా టైం బాండ్ ప్రమోషన్లు కల్పించాలని సూచించారు. ప్రస్తుతం ఈపీ ఆపరేటర్లు నడిపే యంత్రాలన్ని బీ, ఏ గ్రేడ్ యంత్రాలే కాబట్టి వెంటనే ప్రమోషన్లు కల్పించాలన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో ఈపీ ఆపరేటర్ల పాత్ర ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, కిరణ్‌బాబు, దివాకర్, ఆపరేటర్లు గణేశ్, మోహన్‌రావు, రారాజు, తిరుపతి, సంతోష్, రవి, ఇర్షద్‌బాబా, ఎండీ ఆజాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



జోడేఘాట్‌లో విద్యార్థులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యార్థుల వైజ్ఞానిక క్షేత్ర పర్యటనలో భాగంగా శుక్రవారం జోడేఘాట్ కుమురంభీం మ్యూజియాన్ని సందర్శించారు. గిరి పుత్రుల జీవన విధానం, నిత్యం వాడే వస్తువులు, అటవీ ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం జోడేఘాట్ మ్యూజియంలో ఉన్న వస్తువులను పరిశీలించారు. హెచ్‌ఎం విజయ నిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, గంగాభవాని, సుజాత, లక్ష్మి, నగేష్, కళావతి, భారతి, శ్రీధర్, సాదియా, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.